## క్లుప్తంగా

### మెట్టును ఫోన్‌లో పరామర్శించిన వైఎస్ జగన్

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి చిన్నపాటి అనారోగ్యానికి గురై రెండు రోజులుగా బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెట్టు గోవిందరెడ్డికి ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబ సభ్యులందరితో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బంది లేదని, రెండు రోజుల్లో రాయదుర్గంలో పార్టీ సూచించిన కార్యక్రమాల్లో పాల్గొంటానని మెట్టు తెలియజేశారు.

### న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయదుర్గంటౌన్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి రాజ్యాంగానికి మాయని మచ్చ అని బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం రాయదుర్గం పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లేశప్ప, వన్నూరుస్వామి , లోకానంద, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, పృథ్వీ, రఘు, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### మెట్టును కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు


సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని శుక్రవారం బెంగళూరులోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమనలు మెట్టును కలిశారు. బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు.

### ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీతకు సన్మానం


పృథ్వీరాజ్‌ను సన్మానిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం యూనియన్ నాయకులు

కళ్యాణదుర్గం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ నెల 6న ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు అందుకున్న పృథ్వీరాజ్‌ను శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని పృథ్విరాజ్ ఇంట్లో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు, మండల కార్యదర్శి రంగనాథ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతలమ్మ, జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, కార్యనిర్వాహకులు నాగరాజు, మండల అధ్యక్షురాలు పాతక్క, గంగమ్మ, రమేష్, గౌరీ తదితరులు పృథ్వీరాజ్‌ను సన్మానించి అతడి తండ్రి వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న కార్మికుడు ఈశ్వరప్పను అభినందించారు.

### పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


బచ్చేహళ్లలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

శెట్టూరు: పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జెడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని బచ్చేహళ్లిలో సీఈఓ పర్యటించారు. ఉదయమే గ్రామ వీధుల్లో పర్యటించి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇళ్ల వద్దకు వెళ్లి రోజూ చెత్త సేకరణ జరుగుతోందా అంటూ ఆరా తీశారు. తడి, పొడి చెత్తలను ఎలా వేరు చేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. శ్యానిటేషన్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జిలానిబాషా, ఈఓఆర్డీ రఘురాంరావు, సర్పంచ్ ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘పచ్చ’పాతం

- పండ్ల తోటల పెంపకానికి అడ్డుపడుతున్న టీడీపీ నేతలు
- వివరాలు అప్‌లోడ్ చేసేందుకు జంకుతున్న ఉపాధి సిబ్బంది
- నష్టపోతున్న అన్నదాతలు

గుమ్మఘట్ట: పండ్ల తోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ఐదు ఎకరాల్లోపు జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి రైతూ మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి అర్హుడు. మండల వ్యాప్తంగా 400 ఎకరాల మెట్ట భూముల్లో దానిమ్మ తోటలను రైతులు అభివృద్ధి చేశారు. ఎకరా పొలంలో దానిమ్మ సాగుకు రూ.లక్ష వరకూ ఖర్చు అవుతుంది. తోటను కాపాడుకోవడం కూడా చాలా శ్రమతో కూడుకుని ఉంటుంది. మొక్క నాటిన నెల రోజుల తర్వాత నుంచి నుంచి మూడేళ్ల పాటు కాపలా, నీటి సంరక్షణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

**అడ్డుకుంటున్న టీడీపీ నేతలు**

గుమ్మఘట్ట మండలంలోని మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి స్థానిక టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటిన రైతులకు ప్రతి నెలా బిల్లులను కేంద్రం చెల్లిస్తూ వస్తోంది. ప్రతి నెలా ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ఆధారంగా ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో మెట్ట భూముల్లో పండ్ల మొక్కలను నాటిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఉపాధి సిబ్బందిపై టీడీపీ నేతలు ఆంక్షలు విధించారు. తాము చెప్పిన రైతుల పేర్లను మాత్రమే అప్‌లోడ్ చేయాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించిన దానిమ్మ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దానిమ్మ తోటలను అభివృద్ధి చేసి నాలుగైదు నెలలు గడిచినా నేటికీ వివరాలు అప్‌లోడ్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.


చెట్టులో విరగ్గాసిన దానిమ్మ పండ్లు

#### న్యాయం చేయాలి



మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టిన రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందేలా చర్యలు తీసుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకూ న్యాయం చేకూరింది. పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. అదే తరహాలో ఇప్పుడూ రైతులకు న్యాయం చేకూరాలి. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గరాదు.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త

#### అర్హత ఉన్న ప్రతి రైతుకూ న్యాయం



అర్హత ఉన్న ప్రతి రైతుకూ తప్పనిసరిగా న్యాయం చేస్తాం. ఐదు ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండి జాబ్‌కార్డు కలిగిన రైతులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చూస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సలీంబాషా, పీడీ, డ్వామా

### పాడి పశువులకు వైద్య శిబిరం


మాట్లాడుతున్న డీఎల్‌డీఏ వెంకటేశ్

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో పాడిపశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం , పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి డాక్టర్ వెంకటేష్, శింగనమల పశువైద్యశాల సంచాలకుడు డాక్టర్ పద్మనాభం ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 44 పశువులకు వైద్యం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పశువులకు పెయ్య దూడలు మాత్రమే పుట్టే వీర్యం అందుబాటులో ఉందని, రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగలింగేశ్వరరెడ్డి, డాక్టర్లు ప్రసాద్, శ్రీకాంత్, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్, రైతులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే సహించం


పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు


రాయదుర్గం: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ హయాంలో పేద వైద్య విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే సహించబోమని మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుచూపుతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను కట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్ 17 కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చి, వాటిని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపట్టామన్నారు. అక్టోబర్ 10 నుంచి నవంబర్ 22 వరకూ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ద్వారా సంతకాల సేకరణ, అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. 12న జిల్లా కేంద్రంలో ర్యాలీలు, 23న నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు పంపుతామన్నారు. 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పత్రాల తరలింపు అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు కోటి సంతకాల పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, జెడ్పీటీసీ బొమ్మన్న, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మున్సిపల్ విభాగం కన్వీనర్ సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జి.హనుమంతరాయుడు, ఎంపీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, రాష్ట్ర నాయకుడు యర్రంపల్లి కృష్ణమూర్తి, కౌన్సిలర్లు లక్ష్మన్న, కుర్రా రాము, పరమేశ్వరప్ప, నాయకులు తిప్పేస్వామి, కిరీటియాదవ్, దొడ్లో తిప్పేస్వామి, చరణ్, మురళి, తేజ, కేశవగౌడ్, లాయర్ ఎర్రిస్వామి, రామిరెడ్డి, పాండు, రాజు, మల్లి, మంజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**పోస్టర్ల విడుదల**

రాయదుర్గంటౌన్: చంద్రబాబు కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం ప్రారంభమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గొల్ల రామాంజనేయులు పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందాలనే గొప్ప సంకల్పంతో వైఎస్ జగన్ తీసుకొచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుండటం సిగ్గుమాలిన చర్యన్నారు. శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్లు నాగప్ప, రఘురాం, జిల్లా గ్రీవెన్స్ సెల్ మురళీమోహన్‌రెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కణేకల్లు కేశవరెడ్డి, వైఎస్ ఎంపీపీ అరుణ్‌కుమార్, ఎంపీటీసీ ఆంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్‌లు గౌని శ్రీరామిరెడ్డి, గోనబావి నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్, రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రశాంత యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడకండి.. అండగా ఉంటాం

ఉరవకొండ రూరల్: మాజీ వలంటీరు కొడిగి మహేష్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి భరోసా కల్పించారు. మహేష్ గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన గ్రామానికి చేరుకుని మహేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహేష్ పెద్దనాన్న పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొడిగి గోవిందుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ మహేష్ మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేలా పోలీసు ఉన్నతాధికారులను కోరనున్నట్లు తెలిపారు. మహేష్ చనిపోయిన తీరు పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అనుమానాలు ఉన్నాయని దీని పై పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన వెంటనే విచారణ జరిగేలా చేస్తామన్నారు. ఎంపీపీ నరసింహులు, నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, చాబాల సర్పంచ్ జగదీష్, షేక్షానుపల్లి రమేష్, బాలకృష్ణ, ప్రభాకర్, ఓబుళపతి, సురేంద్ర, గంధోడి మారేష్ పాల్గొన్నారు.


లత్తవరంలో మహేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

# ‘పోస్టల్ బీమా సద్వినియోగం చేసుకోండి’

కళ్యాణదుర్గం: పోస్టాఫీసు ద్వారా సేవింగ్స్ ఖాతా తెరిచి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని, అలాగే బీమా ప్రీమియం చెల్లించి లబ్ధి పొందాలని కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రావు సూచించారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన బ్రాంచ్ మాస్టర్లతో ఆయన సమావేశమై బీమా పథకాలపై అవగాహన కల్పించారు. బీమా పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. కర్నూల్ రీజియన్ పరిధిలో కళ్యాణదుర్గం డివిజనల్ సిబ్బంది రూ. 55 లక్షల ప్రీమియం సేకరించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ మధ్య కాలంలో ఆర్పీఎల్ఐ డ్రైవ్‌లో కళ్యాణదుర్గం సబ్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. సబ్ డివిజన్ ఏర్పాటు చేసిన తర్వాత ప్రజల నుంచి పెద్ద మొత్తంలో ప్రీమియం సేకరించడం ఇదే ప్రథమమన్నారు. మండలంలోని కురబరహళ్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బాగా పనిచేసిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లను సన్మానించారు. అనంతరం రూ.10 లక్షల ప్రీమియం సేకరించిన బీపీఎం ముత్యాలును అభినందించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది బోయ మల్లికార్జున, తిమ్మరాజు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గణితం టీచర్ లేకపోతే ఉత్తీర్ణత సాధించేదెలా?

కూడేరు: గణితం సబ్జెక్ట్ అంటేనే విద్యార్థులు కష్టమని భావిస్తారు. బట్టీ పట్టి చదివే సబ్జెక్ట్ కాదు. అర్థవంతం చేసుకుని సాధన బాగా చేస్తేనే గణితంలో మంచి మార్కులు సాధించేందుకు అవకాశముంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో గణితం టీచరే లేకపోతే విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. కూడేరు మండలం కరుట్లపల్లి హైస్కూల్‌లో ఇదే జరుగుతోంది. హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 167 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పదో తరగతిలోనే 34 మంది విద్యార్థులున్నారు. కాగా జూన్ 30న గణితం టీచర్ పదవీ విరమణ పొందారు. దీంతో నాటి నుంచి గణితం టీచర్ లేరు. దీంతో గణితం సబ్జెక్ట్ బోధించేవారు లేక విద్యార్థులు గణితంలో వెనుకబడి పోతున్నారు. ప్రస్తుతం డీఎస్సీలో ఎంపికైన వారికి ప్లేస్‌మెంట్ ఇచ్చేందుకు ఇక్కడ ఖాళీ చూపించడం లేదు. దీంతో హైస్కూల్‌లో గణితం బోధించే ఉపాధ్యాయులే ఇక ఉండరు. గణితం టీచర్ లేక పోతే ఎలా అని పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి గణితం టీచర్‌ను నియమించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


కరుట్లపల్లి హైస్కూల్

### ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

బెళుగుప్ప: నంద్యాల జిల్లా గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు చెన్నబసవరాజుపై దాడి అమానుషమని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యావ్యవస్థలో బయటి వ్యక్తుల ప్రభావం వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వజీర్‌బాషా, మండలాధ్యక్షుడు చెన్నబసయ్య, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ పీరా, మండల నాయకులు పాల్గొన్నారు.

### చోరీపై కేసు నమోదు

బెళుగుప్ప: రామసాగరం గ్రామంలో బుధవారం పట్టపగలే బోయ పద్మావతి ఇంటిలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఘటనలో రెండున్నర తులాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ పేర్కొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ


జయరామిరెడ్డిని పరామర్శిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గం: కణేకల్లు మండలంలోని కోతూర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉషారాణి భర్త, పార్టీ సీనియర్ నాయకుడు కోతూర్తి జయరామిరెడ్డికి అనారోగ్యం కారణంగా బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఆస్పత్రికెళ్లి జయరామిరెడ్డిని పరామర్శించారు. విశ్వ వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళ్లకెర వీరభద్రారెడ్డి ఉన్నారు.

### బాల్య వివాహాలతో అనర్థాలు


కేజీబీవీలో బాలికలకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి

శెట్టూరు: బాల్యవివాహాలతో ఆడపిల్లల జీవితాల్లో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కిశోర దశలో జరిగే మార్పులు, ఎదురయ్యే సమస్యలు, ఒత్తిడిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలిక అక్రమ రవాణా, గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. బాలికలకు అనుకోని సమస్యలు ఎదురైనప్పుడు చైల్డ్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, మెడికల్ హెల్ప్‌లైన్ 104, అత్యవసర హెల్ప్‌లైన్112 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలోఎస్ఓ లలిత, అంగన్‌వాడీ సిబ్బంది అపర్ణ, విశాల, భీమక్క, విమల, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సచివాలయ స్థలంలో అక్రమ నిర్మాణం

- టీడీపీ కార్యకర్త ఇష్టారాజ్యం

విడపనకల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతల దౌర్జన్యాలకు అంతు లేకుండా పోతోంది. మా ప్రభుత్వం.. మా ఇష్టం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. రూ.లక్షలు విలువ చేసే విడపనకల్లు మండలం గడేకల్లులో 63వ జాతీయ రహదారి పక్కనే ఉన్న సచివాలయ స్థలాన్ని స్థానిక టీడీపీ నేత కమ్మ నారప్ప ఆక్రమించుకుని ఇటీవల గృహ నిర్మాణం చేపట్టడమే ఇందుకు నిదర్శనం. అక్రమ నిర్మాణంపై అధికారులు సైతం పల్లెత్తు మాట మాట్లాడలేకపోతున్నారు. టీడీపీ నాయకులకు అడ్డు చెబితే దాడులు చేస్తారానే భయం స్థానికులనూ వెన్నాడుతోంది.

**చర్యలు తీసుకోండి : తాసి సుశీల, సర్పంచ్, గడేకల్లు**

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కమ్మ నారప్ప ఇంటిని కోల్పోయాడు. అయితే ఆ సమయంలో అతనికి నష్టపరిహారాన్ని ఎన్‌హెచ్ అధికారులు అందజేశారు. అదే సమయంలో నారప్ప భార్య కె.లక్ష్మి పేరుపై సర్వే నంబర్ 386–బీ లో 1.50 సెంటు ఇంటి స్థలం కూడా మంజూరైంది. ఆ స్థలంలో కాకుండా అయితే సచివాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టారు. ఆక్రమణను అరికట్టి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంగా శుక్రవారం తహసీల్దార్‌తో పాటు పోలీసులను కలసి వినతి పత్రం అందజేశాం.


గడేకల్లులో సచివాలయం వద్ద దౌర్జన్యంగా చేపట్టిన ఇంటి నిర్మాణం

**13న జరిగే ధర్నాకు తరలిరండి**

కూడేరు: కూడేరు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ రాజు అరాచకాలకు నిరసనగా ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. సీఐ రాజు వైఎస్సార్ సీపీ శ్రేణుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆయన తెలిపారు.

**పోషణ మాసోత్సవాలు**

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డ్వామా హాల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సీడీపీఓ పద్మావతి హాజరయ్యారు. ఆరోగ్యకరమైన, బలమైన సమాజ నిర్మాణం పౌష్టికాహారంతోనే సాధ్యపడుతుందన్నారు.

**మెడికల్ షాపుల తనిఖీ**

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మెడికల్ షాపులను తహసీల్దార్ అనిల్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా వినియోగదారులకు తగ్గిన ధరల ప్రకారం మందులు విక్రయించాలని తహసీల్దార్ నిర్వాహకులకు సూచించారు.

**బాలిక అదృశ్యం**

వజ్రకరూరు: వెంకటాంపల్లిచిన్నతాండా గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. వివరాలు.. బాలిక అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. దసరా సెలవుల కోసం ఇంటికొచ్చిన బాలిక తర్వాత కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి వచ్చింది. అయితే కళాశాలకు రాలేదని తెలుసుకున్న తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. .

**చోరీపై కేసు నమోదు**

వజ్రకరూరు: కొనకొండ్ల బళ్లారి బైపాస్‌లో ఉన్న రియలన్స్ జియో టవర్ వద్ద సామగ్రి చోరీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 19న రిలయన్స్ జియో టవర్‌లో 4 బ్యాటరీలు, నాలుగు రెక్టిఫైర్స్‌లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కంపెనీ సూపర్‌వైజర్ శ్రీధర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**తప్పిన ప్రమాదం**

కూడేరు: ముద్దలాపురం వద్ద శుక్రవారం రాత్రి అనంతపురం –బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో గడేకల్‌కు చెందిన వ్యక్తులకు ప్రమాదం తప్పింది. వివరాలు.. గడేకల్‌కు చెందిన వ్యక్తులు కారులో కూడేరు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఘటనా స్థలికి రాగానే ముందు వెళుతున్న లారీ ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి లారీని ఢీకొంది. దీంతో కారు ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్, మరొక వ్యక్తి సీట్ బెల్టులు పెట్టుకోవడం, బెలూన్లు తెరుచుకోవడంతో వారి ప్రమాదం తప్పింది.

**నేడు ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’**

బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లి, చంద్రగిరి, సిద్దరాంపురం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

**విడపనకల్లు చెక్‌పోస్టు వద్ద ‘ఫేష్ వాష్ అండ్ గో’**

ఉరవకొండ(విడపనకల్లు): తెల్లవారుజామున జరిగే రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలనే సంకల్పంతో శుక్రవారం రాత్రి విడపనకల్లు చెక్‌పోస్టు వద్ద ఫేస్ వాష్ అండ్‌గో కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఎస్ఐ ఖాజాహుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

**భూసార పరీక్షలపై అవగాహన అవసరం**

కణేకల్లు: భూసార పరీక్షలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాయదుర్గం ఏడీఏ పుష్పలత, భూసార పరీక్షా కేంద్రం ఏఓ మెహరున్నిషా బేగం పేర్కొన్నారు. కణేకల్లుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో శుక్రవారం ‘స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం -2025’ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ విద్యార్థుకు పలు సూచనలు చేశారు.

**ఆరోగ్య సూత్రాలు పాటిస్తేనే సుఖ ప్రసవం**

కూడేరు: ఆరోగ్య సూత్రాలు పాటిస్తేనే సుఖ ప్రసవం అవుతుందని సీహెచ్ఓ సరోజమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద గర్భిణీలకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన గర్భిణులకు ఎంఎల్‌హెచ్‌పీలు రాణి, చంద్రకళ, షిరీన్, మీనాక్షి, లోకేశ్వరి, శ్రీవిద్యలు వైద్య పరీక్షలు నిర్వహించారు.

**దివ్యాంగులను ప్రోత్సహించాలి**

రాయదుర్గంటౌన్: దివ్యాంగ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శైలజ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల కోసం ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీకి ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల నుంచి దాదాపు 251 మంది దివ్యాంగ విద్యార్థులు ఉపకరణాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

**25లోపు ఈ– క్రాప్ నమోదు పూర్తి చేయాలి**

వజ్రకరూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదును ఈనెల 25లోపు పూర్తి చేయాలని ఏడీఏ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన రాగులపాడులో ఈ–క్రాప్ నమోదును పర్యవేక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై ఈ–క్రాప్ నమోదుపై దిశానిర్దేశం చేశారు. ఏఓ మధుకర్, టెక్నికల్ ఏఓ భరత్, ఎంపీఈఓలు సుజాత, బొలికొండ తదితరులు పాల్గొన్నారు.